# మేడమ్ గుడ్‌మార్నింగ్

మేడమ్, పది రూపాయలిప్పించండి. రేపు తప్పకుండా తిరిగి ఇచ్చేస్తాను. ఆ కంఠం విని ప్రక్కకు తిరిగేను 'రాజులమ్మ' ఆమెను చూసీ చూడడంతో నా కళ్ళెదుట రెండేళ్ళ క్రితం జరిగిన సంఘటన చేదు అనుభవాల సినిమా రీలులా గిర్రున తిరిగేయి ..

రాత్రి సుమారు ఎనిమిది – ఎనిమిదిన్నర అయి ఉంటుంది. రాజులమ్మ ఎంతో గాభరాగా అలిసిపోయిన మొహంతో మా యింటికొచ్చింది. ఎంతో బాధతో బొంగురుపోయిన కంఠంతో "టీచర్‌గారూ! అత్యవసరంగా మూడు వేలు నాక్కావాలి. రెండు రోజుల్లోగా పాలిటెక్నిక్ పరీక్ష ఫీజు కట్టకపోతే పరీక్ష రాయినివ్వరు. మా బాబు భవిష్యత్ పాడై పోతుంది. ఈ మూడు వేలు కోసం ఎంత తిరిగేనో మీకేం చెప్పను. కాని ఎక్కడ అప్పు పుట్టలేదు. ఆఖరుకు మీ వద్దకు వచ్చేను. మీ దగ్గర లేకపోతే మీ స్కూల్‌లో ఎవరినైనా అడిగి కాస్త సర్దిపెట్టండి. వచ్చే నెల వడ్డీతో సహా తీర్చేస్తాను." అని అంది ఆమె. ఆమె అడిగే విధం, స్వరంలో వ్యాకులత నన్ను కరిగించేసేయి. పోని సర్దుదామంటే నా దగ్గర వంద కూడా లేవు. నేను ఆలోచించేను రేపు నేను ఈ పరిస్థితిని ఎదుర్కోవల్సి వస్తే డబ్బు ఎక్కడా పుట్టకపోతే నా కొడుకు భవిష్యత్తు ఏమవ్వాలి. మరి ఎలాగోలాగ డబ్బు సర్దేను. ఆమెకు డబ్బులిస్తూ "అతి కష్టం పైన మూడు రూపాయల వడ్డీకి మూడు వేలు మీ కోసం తెచ్చాను. మళ్ళీ నెలవడ్డీతో సహా తిరిగి యిచ్చేయ్యండి. నాకు మాట రాకూడదు" అని.

"అదేంటండీ టీచర్‌గారు! మీరు నాకంత ఉపకారం చేసేరు. నేను మీకు మాట వచ్చేలా చేస్తానా?" అని కృతజ్ఞతల వర్షం కురిపిస్తూ వెళ్ళిపోయింది. గాని ఆ నెల తరువాత నుండి – ఇవాళ రేపు అంటూ రెండేళ్ళు గడిపేసింది. వడ్డీలేదు అసలు లేదు. నేను మటుక్కి రోజు స్కూల్‌కి వచ్చేటప్పుడు వెళ్ళేటప్పుడు ఆమె ఇంటికి తిరుగుతూండేదాన్ని ఆఖరుకు మెంటల్ టెన్షన్ భరించలేక ఆమెతో "ఇస్తే ఇచ్చేరు, లేకపోతే లేదు. మీకిచ్చేనన్న మాటే మరచిపోతానని" చెప్పటానికి ఆమె యింటికి వెళ్ళినప్పుడు ఆమె తన స్నేహితురాలితో మాట్లాడుతుంది. నన్ను చూసి ఏదో సాకు చెప్పబోతూంటే," చూడండి రాజులమ్మగారు ఆఖరుసారిగా నేను ఆ సొమ్ము యివ్వమని అడుగుతున్నాను. ఇస్తే యివ్వండి లేకపోతే యివ్వకండి. మీ యింటి చుట్టూ తిరిగే శక్తి నాలో నశించిపోయింది. మీరుకూడ నన్ను చూసి ఏవేవో కథలు చెప్పనవసరం లేదు. మీకు మూడు వేలు యిచ్చినట్లే మరచిపోతాను.

నాతో యిహ మీరెప్పుడు కలవడానికి గాని మాట్లాడడానికి గాని ప్రయత్నించవద్దు అని చెప్పేను.

నా మాట పూర్తయ్యేలోపే, చూడవే సావిత్రి! నేను ఆ మూడు వేలు ఇవ్వలేనని నన్ను క్షమించి యివ్వక్కరలేదంది. నువ్వు వున్నావు ఎనిమిది వందల కోసం వారానికి ఎనిమిది సార్లు నన్నడుగుతావు.

ఇది విని బిత్తరపోయాను. ఆ స్నేహితురాలు నిరాశతో రాజులమ్మని నన్ను మార్చి మార్చి చూస్తుండే పోయింది. నేను అవాక్కురాలైనాను.

ఆ ఎనిమిది వందల కూడా పోయినట్లే అనిపించింది. నేను బరువుగా నడుస్తూ బయటికి వచ్చేసేను. ఇన్నేళ్ళ తరువాత బ్యాంకులో ....

– పారనంది నిర్మల

---

# లౌక్యం

వర్షపు ధారల మధ్య చిక్కుకున్న పక్షి కూనలా ... ఆ ముసిల్ది వొణుకుతూ. అందరి దగ్గర చేయి చాపుతూ అడుక్కుంటూ వుంది. దాదాపు గంట నుండి దేవాలయం మెట్ల మీద పడి వున్నాను. వస్తానన్న ఫ్రెండ్ రాకపోయేసరికి విసుగ్గా వుంది. పరిసరాలను గమనిస్తూ కూర్చువడంలో ముసిలి బిక్ష గత్తెను అనుకోకుండా గమనించడం జరుగుతుంది. అప్పుడప్పుడు గిన్నెలో చిల్లరను తడిమే పద్ధతిని బట్టి కళ్ళు సరిగ్గా కనిపించటం లేదని అర్థమైంది.

ఇంతలో మెట్లు దిగి వెళ్లుతున్న జనాభాలో ఓ ప్రేమ జంటపై నా దృష్టి పడింది. సరిగ్గా ముసిల్దాని దగ్గర వారు నిలబడ్డారు. రెండు మెట్లుపైన ఉన్న నేను, వారి సంభాషణను ఆసక్తిగా వింటూ ఉన్నాను.

ఆ యువకుడు "అయ్యో ... చేంజ లేదే, ఫైవ్ రూపీస్ కాయిన్ ఉంది" అంటూ జేబు తడుముతున్నాడు."

"నా దగ్గర కూడ లేదు ఫిఫ్టీ రూపీస్ నోట్‌వుంది" అందా అమ్మాయి.

అయినాసరే పూర్! "పాపం ఆ ముసిలిదాన్ని చూస్తే మనస్సు వొప్పడం లేదు. ఫైవ్ రూపీస్ కాయిన్ వేస్తాను." జేబులో కాయిన్ ఆ పళ్ళెంలో జారవిడిచాడు.

అతనిలోని జాలి, దయా గుణానికి అమ్మాయి బాగా ఫీల్ అయినట్టు వుంది. వెంటనే తన పర్సులోని ఫిఫ్టీ రూపీస్ నోట్, చనువుగా షర్టుజేబులో వుంచింది అతను వద్దు, వద్దు అంటువుంటే ... పర్వాలేదు పద అంది.

కొన్ని మెట్లు దిగి ఆ అమ్మాయిని సాగనంపాక, ఏదో మరిచి పోయినట్లు ఆ యువకుడు, వెనుదిరిగి స్పీడ్‌గా వచ్చాడు. బిక్షగత్తె దగ్గర ఆగి, పది పైసల బిళ్ళ వేసి, ఫైవ్ రూపీస్ కాయిన్ తీసుకొని, అదే వేగంతో మెట్లు దిగుతున్నాడు.

క్షణం కాలంపాటు జరిగినది అర్థమై ఆశ్చర్యం నుండి తేరుకొనేసరికి ఎదురుగా నా మిత్రుడు నా వైపు వింతగా చూస్తూ ...

– పొన్నపూడి నాగలక్ష్మి